ప్రజాశక్తి
మంగళవారం 02 ఏప్రిల్ 2024
5
కర్నూలు



సమస్యలపై మౌనరాగం

- మొక్కుబడిగా సిఎం 'మేమంతా సిద్ధం'
- వ్యక్తమవుతున్న విమర్శలు



ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సమస్యలపై మౌనరాగం వహిస్తూ ముందుకు సాగారు. ఆయన చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర మొక్కుబడిగా సాగింది. జిల్లాకు ఏం చేస్తామో చెప్పకుండా యాత్ర చేయడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి... కనీసం సమస్యలపై కూడా స్పందించలేదు.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో చేపట్టిన బస్సు యాత్రతో రెండు రోజుల పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తొలి రోజు బస్సు యాత్ర ప్రారంభమైంది. సిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో గ్రామస్తులతో జగన్ ముఖాముఖి నిర్వహించారు. గ్రామానికి వైసిపి ప్రభుత్వం చేసిన వాటి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం యాత్ర నంద్యాలకు చేరుకుంది. నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో జగన్ జిల్లాకు ఎలాంటి హామీల ఊసే ఎత్తలేదు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నంద్యాలను మున్సిపల్ కార్పొరేషన్‌గా చేయాలని, నంద్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని, రింగ్ రోడ్డు ఇవ్వాలని ప్రతిపాదించినా జగన్ వాటి ప్రస్తావన తీసుకు రాలేదు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర రెండో రోజు కర్నూలు జిల్లాలో సాగింది. కర్నూలు జిల్లా పెంచికలపాడు నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. కోడుమూరులో జగన్ చేనేతలతో మాటా మంతీ నిర్వహించారు. కైరవాడి, గోనెగండ్ల, రాళ్లదొడ్డి మీదుగా ఎమ్మిగనూరు వరకు యాత్ర సాగింది. ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ ప్రసంగంలోనూ హామీలను ప్రస్తావించలేదు. జిల్లాకు ఏం చేస్తామో చెప్పలేదు. ఎమ్మిగనూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక నీటి సమస్య నివారణ కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించాలని, చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరినా వాటి మీద కూడా జగన్ స్పందించలేదు.

గుండ్రేవుల ఏదీ..?

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి గుండ్రేవుల ప్రాజెక్ట్‌ను నిర్మిస్తానని 2017 నవంబరు 27న జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. 2019లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నిధులను కేటాయించారు. ఆ తర్వాత ఎన్నికల్లో టిడిపి ఓడింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా తాజా పర్యటనలోనూ ముఖ్యమంత్రి గుండ్రేవుల ఊసే ఎత్తలేదు.

నీటిని మరిచారు

దశాబ్దాలుగా కోడుమూరు ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. వైసీపీ అధికారం చేపట్టి నెల రోజులకే గాజులదిన్నె నుంచి పైప్‌లైన్ ద్వారా కోడుమూరుకు తాగునీరు తెస్తామని, సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను నిర్మిస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ పట్టించుకోలేదు. ఎల్లెల్సీని ఆధునికీకరించి, ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆదోని, ఆలూరు ప్రాంత ప్రజాలకు హామీ ఇచ్చారు. ఆదోని పట్టణ జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒక్కటీ నెరవేరలేదు. ఆలూరు నియోజకవర్గంలో శాశ్వత సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి వేదవతి ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు. 15 ఏళ్లుగా శంకుస్థాపనకే పరిమితమైన నగరడోన రిజర్వాయర్ నిర్మించి చిప్పగిరి, ఆలూరు ప్రాంతాల్లో 4,200 ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏదీ నెరవేరలేదు. కెసి ఆయకట్టు స్థిరీకరణ కోసం సాగునీటి వనరులను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు. ఈ సమస్యలపైనా సిఎం ఎక్కడా మాట్లాడలేదు.

ఆగని వలసలు

వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. దీంతో జిల్లాలో వలసలు ఆగడం లేదు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల నుంచి ఏటా వలసలు కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జిల్లా నుంచి 2 లక్షల మంది వలస వెళ్తున్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో ఎక్కడా వలసల గురించి ప్రస్తావించలేదు.

'పది' మూల్యాంకనం ప్రారంభం

- విధుల నిర్వహణకు ఉపాధ్యాయుల నిరాకరణ
- ఆగ్రహం వ్యక్తం చేసిన డిఇఒ
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మినహాయింపు ఇవ్వాలి
- ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. మూల్యాంకన విధుల నిర్వహణకు ఉపాధ్యాయులు ముందుకు రాకపోవడం పట్ల డిఇఒ కె.శామ్యూల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేకమంది ఉపాధ్యాయులు పలు కారణాలతో విధులు నిర్వహించేందుకు ముందుకు రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులైన ఉపాధ్యాయులకు తప్పనిసరిగా మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సోమవారం నుంచి కర్నూలు నగరంలోని ఎక్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే మూల్యాంకన నిర్వహణలో భాగంగా 598 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 99 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. ఈ మూల్యాంకనంలో భాగంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన పదో తరగతి జవాబు పత్రాలు వివరాలు ఇలా ఉన్నాయి. 1,84,267 పదో తరగతి జవాబు పత్రాలు జిల్లా కేంద్రానికి వచ్చాయి. జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను ఈనెల 8 వరకు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారి ఏర్పాటు చేశారు. రోజూ కేవలం 40 జవాబు పత్రాలను మాత్రమే అసిస్టెంట్ ఎగ్జామినర్ మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. అలాగే పదో తరగతి జవాబు పత్రాలను మూల్యాంకనం నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ కూడా త్వరగా చెల్లించాలని ఉపాధ్యాయులు కోరుతున్నాయి. గతేడాది ఇంకా అనేకమంది ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ నిధులు విడుదల కాలేదని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాలు డిఇఒ దృష్టికి తీసుకెళ్లాయి. ఆ నిధులను త్వరగా విడుదల చేస్తామని డిఇఒ హామీ ఇచ్చారు.

సగంమంది హాజరు కావడం పట్ల డిఇఒ అసంతృప్తి

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియకు దాదాపు సగం మంది కూడా హాజరు కాకపోవడం పట్ల డిఇఒ శామ్యూల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరికైతే మూల్యాంకనం ప్రక్రియలో విధులను కేటాయించారో వారు తప్పనిసరిగా రిపోర్ట్ చేసుకోవాలని, లేకపోతే వారిపై సిసిఎ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోపక్క దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు డిఇఒను కోరాయి. అందుకు స్పందించిన డిఇఒ... అలాంటి వారికి తప్పనిసరిగా మినహాయింపు ఇస్తామని తెలిపారు.

కార్మికులకు అండగా ఉండే

వారిని గెలిపించుకుందాం

- ఆటో స్టాండ్ డ్రైవర్లు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కార్మికులకు అండగా నిలిచే వారిని గెలిపించుకుందామని, కార్మిక నేత సిపిఎం కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి గెలుపునకు కృషి చేద్దామని పాత బస్టాండ్‌లో గల సాయిబాబా ఆటో స్టాండ్ డ్రైవర్లు కోరారు. సోమవారం నగరంలోని కొత్తపేట ఏరియా ఆటో డ్రైవర్ల సమావేశం సాయిబాబా గుడి ఆవరణలోని ఆటోస్టాండ్‌లో నిర్వహించారు. ఆటో యూనియన్ (సిఐటియు) ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఎ.రవి కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయి, సిపిఎం జిల్లా నాయకులు నాగరాజు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం రవాణా రంగ డ్రైవర్లకు భారంగా మారిన చట్టాలను తీసుకొస్తోందని విమర్శించారు. జిఒలు తెచ్చి రవాణా రంగంపై కోట్లాది రూపాయలు భారాల వేస్తున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు వ్యతిరేకించకుండా బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. కార్మికులపై భారాలు మోపుతున్న బిజెపి అడుగులకు మడుగులు వత్తే వైసిపి, టిడిపి, బిజెపిలను ఓడించాలని కోరారు. కార్మిక, ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడుతూ ఆటో కార్మికులకు ఏ ఇబ్బందులు వచ్చినా స్పందిస్తూ ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్న సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా కష్టకాలంలో కూడా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ప్రభుత్వాలు భారీగా పెంచాయని తెలిపారు. ముడిచమురు ధరలు తగ్గినా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించలేదని చెప్పారు. నిత్యం ధరలను పెంచుతూ ఒక్కో ఆటో డ్రైవర్‌పై సంవత్సరానికి రూ.వేలను ఈ ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని విమర్శించారు. ఇప్పటిదాకా చట్టసభల్లో వామపక్షాలు లేకపోవడంతో ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. అదే వామపక్షాలు చట్టసభల్లో ఉంటే ప్రభుత్వ ఆటలు సాగవని చెప్పారు. ప్రజలు ఆలోచించి రానున్న ఎన్నికల్లో కార్మిక నాయకులు ప్రజా సంక్షేమం కోరే సిపిఎం అభ్యర్థి సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం గౌస్‌దేశాయికి ఆటో డ్రైవర్లు పూలమాల వేసి సంఘీభావం తెలిపారు. ఆటో యూనియన్ (సిఐటియు) నాయకులు సాయి బాబా, స్టాండ్ సీనియర్ నాయకులు వీరన్న, సామ్యేలు, చిన్న, జీవన్, పెద్ద రంగస్వామి, చిన్న భాస్కర్, రామచంద్ర, ప్రేమ్ కుమార్, రాజు, జగన్ పాల్గొన్నారు.



గౌస్‌దేశాయిని సన్మానిస్తున్న ఆటో డ్రైవర్లు

3 నుంచి పింఛన్ల పంపిణీ

- గ్రామ/వార్డు సచివాలయాల్లోనే అందజేత
- ఆధార్ సహా ఇతర గుర్తింపు కార్డులతో
- జిల్లాలో మొత్తం పింఛన్లు 2,47,456
- వాలంటీర్ల పాత్ర ఉండరాదు : కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 3న బుధవారం నుంచి సామాజిక భద్రత పింఛను కింద పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు నేరుగా సచివాలయాల్లోనే అందజేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాలు జారీ చేశారు. పింఛను పొందుతున్న లబ్ధిదారులు పింఛను పుస్తకాన్ని కాకుండా ఆధార్ కార్డు లేక ఇతర గుర్తింపు కార్డులను చూపించి నగదు తీసుకోవాల్సి ఉంటుంది. మంగళవారం నాటికి పింఛను నగదుకు సంబంధించిన నిధులను సంబంధిత అధికారులకు బ్యాంకుల ద్వారా అందజేయనున్నారు. పింఛను పంపిణీలో వాలంటీర్ల పాత్ర ఉండరాదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు.

కర్నూలు జిల్లాలో మొత్తం 2,47,456 పెన్షన్లు ఉన్నాయి. ప్రతినెలా రూ.74.11 కోట్ల నిధులు ఖర్చు అవుతున్నాయి. ప్రతిసారీ గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న వాలంటీర్ల ద్వారా పింఛను నగదును అందజేస్తుండేవారు. వాలంటీరు దగ్గర ఉన్న సెల్ ఫోన్లు, బయోమెట్రిక్ యంత్రాలను నేరుగా జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలని ఆదేశాలు అందాయి. వీటన్నింటినీ సోమవారం వాలంటీర్లు సంబంధిత ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేశారు. ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వాలంటీర్ల ద్వారా పింఛన్ల నగదును నిలిపి వేసి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అందుకు అనుగుణంగా గ్రామ/వార్డు సచివాలయాల్లోనే సిబ్బంది ద్వారా నగదు పంపిణీకి చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నుంచి బ్యాంకుల ద్వారా ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పింఛనుకు సంబంధించిన నిధులను డ్రా చేసి నేరుగా గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందికి అందజేస్తారు. అనంతరం బుధవారం ఉదయం 6 గంటల నుంచి పింఛను పొందుతున్న లబ్ధిదారులకు బయోమెట్రిక్ తీసుకొని సచివాలయ సిబ్బంది నగదును అందజేస్తారు. ఈనెల 8 వరకు పింఛను పంపిణీకి చర్యలు తీసుకుంటారు. పింఛను పంపిణీకి సంబంధించి గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందికే లాగిన్ అవకాశం కల్పించారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛను పంపిణీ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ

- డిఆర్‌డిఎ పీడీ సలీం బాషా

సామాజిక భద్రత పింఛను పొందుతున్న లబ్ధిదారులు నేరుగా సచివాలయాలకు వెళ్లి పింఛను తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే పింఛను పంపిణీకి సంబంధించిన అన్ని ఏర్పాట్లూ చేశాం. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం.



34వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్ రెడ్డి

34వ వార్డులో వైసిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : వైసిపి పాణ్యం ఎమ్మెల్యేగా తనను మరోసారి గెలిపించాలని కోరుతూ కాటసాని రాంభూపాల్ రెడ్డి సోమవారం కల్లూరు అర్బన్‌లోని 34వ వార్డులో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్ళి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29వ వార్డులో : 29వ వార్డు సంఘాల సుదర్శన్ రెడ్డి నగర్‌లో కాటసాని మాధవి లతా రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాటసాని రాంభూపాల్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, బిసి నాయకులు ఆచారి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాల్సిందే

- 31 మందిని విధులు నుండి తొలగింపు
- బిజెపి జిల్లా అధ్యక్షుడిపై ఎఫ్ఐఆర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాల్సిందేనని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి.సృజన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన 31 మంది సిబ్బందిని విధుల నుండి తొలగించామని వెల్లడించారు. అందులో 23 మంది వాలంటీర్లు, మెప్మా ఆర్పి ఒకరు, కేఎంసీ పరిధిలో ఒక డ్రైవరు, హెచ్ కైరవాడి పిఎసిఎస్ అటెండర్ ఒకరు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఒకరు, డిఆర్‌డిఎ వైకెపికు చెందిన ఇద్దరు వివోఏలు, ఎస్‌పిఒకు సంబంధించిన రైతు మిత్ర ఒకరిని తొలగించామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు కే నీలకంఠపై ఎఫ్ఐఆర్ కేసు కూడా నమోదు చేసినట్లు వెల్లడించారు. సి విజిల్ యాప్‌కు దాదాపు 123 ఫిర్యాదులు అందగా 82 నిజనిర్ధారణ చేయగా 70కు పైగా వంద నిమిషాలలో పరిష్కరించామని పేర్కొన్నారు.

కర్నూల్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థిగా రాంపుల్లయ్య యాదవ్..?

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జి.రాంపుల్లయ్య యాదవ్‌ను పార్టీ అధిష్టానం ఖరారు చేసినట్లు తెలిసింది. గత రెండ్రోజుల క్రితమే కాంగ్రెస్ పార్టీలో జి.రాంపుల్లయ్య యాదవ్ పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిల సమక్షంలో చేరారు. రాం పుల్లయ్య యాదవ్ కుటుంబం కర్నూలు జిల్లాలో రాజకీయంగా గత కొన్ని సంవత్సరాలుగా క్రియాశీలకంగా ఉన్నారు.

కానరాని చలివేంద్రాలు

- ఏర్పాటులో అధికారుల అలసత్వం - పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో తడారుతున్న గొంతులు
- ప్రధాన కూడళ్లలో నీటి కోసం ప్రజల కష్టాలు వర్ణనాతీతం

ప్రజాశక్తి - సి.బెళగల్

నిండు వేసవి సమీపించినా గొంతులు తడిపే చలి వేంద్రాల ఏర్పాట్లు సి.బెళగల్ మండలంలో ఎక్కడా కానరావడం లేదు. చలివేంద్రాల ఏర్పాట్లపై శ్రద్ధ చూపేదెవరు...? దాహం తీర్చేదేవరంటూ మండల ప్రజల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదేళ్లక్రితం వేసవి ఆరంభంలోనే నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల వారు చలి వేంద్రాల ఏర్పాట్లు జోరుగా సాగించేవారు. బెళగల్‌లో గతంలో ప్రధాన కూడళ్ళు పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, మండల కాంప్లెక్స్ కేంద్రాలలో చలి వేంద్రాలు ఏర్పాట్లు చేసి దాహం తీర్చే వారు. అయితే రెండేళ్ళుగా ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఈ ఏడాది వేసవిలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా నీళ్ల ఎంత తాగినా గొంతులు తడారి దాహం తీరడం లేదు. ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకోవడంలో నాయకులు, అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సి.బెళగల్ మండల కేంద్రానికి నిత్యం పనుల నిమిత్తం ప్రజలు అధికసంఖ్యలో రాకపోకలు సాగిస్తూ అవసరాలు తీర్చుకుంటుంటారు. హోటళ్లలో, ఇతర దుకాణాలలో ఏవైనా కొంటే గానీ, తింటే గాని నీళ్ళివ్వని పరిస్థితి నెలకొంది. అయితే గ్రామాల నుండి వచ్చిన ప్రజలు హోటళ్లలో తినే పరిస్థితి లేకపోవడంతో దాహార్తి తీర్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. చలివేంద్రాలు ఎక్కడా కానరాకపోవడంతో రెండు రూపాయలు పెట్టి వాటర్ ప్యాకెట్ కొని దాహార్తి తీర్చుకుంటున్న పరిస్థితి ఉంది.ప్రభుత్వ కార్యాలయాలలో, ఇతర అవసరాలు తీర్చుకోనేందుకు వస్తున్న ప్రజలకు దాహం కోసం పాట్లు పడుతున్నారు.



గతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం (ఫైల్)

చలివేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

బెళగల్ మండల కేంద్రంలో వెంటనే చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఎన్నికల వాతావరణంలో నాయకులకు, ప్రజాప్రతినిధులకు రాజకీయంపై ఉన్న ఆసక్తి వేసవిలో చలివేంద్రాల ఏర్పాట్లపై లేదు. ప్రభుత్వం కోట్లు వెచ్చించి సభలకు, సమావేశాలకు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాయి. పంచాయతీల అభివృద్ధికి, ఇతర సంక్షేమానికి, ప్రజల దాహార్తి తీర్చడానికి మాత్రం శ్రద్ధ చూపకపోవడం శోచనీయం.

- హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మండల అధ్యక్షులు పి.వెంకట్.

పచ్చదనం పెంచి ఉష్ణోగ్రతలను తగ్గిద్దాం

- ఆదిత్య టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ కె.తిరుపాల్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

చేయి చేయి కలిపి పచ్చదనాన్ని పెంచి పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గిద్దామని ఆదిత్య టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ కె. తిరుపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు నగరంలో నివసించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటి పరిసర ప్రాంతాలలో చెట్లను నాటి వాటిని సంరక్షించి, పచ్చని సుందర ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. కర్నూల్‌లో నగర జనాభా సుమారు 6 లక్షల వరకు ఉందని, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి 2025 నాటికి 1.5 లక్షల మొక్కలు లక్ష్యంతో ముందు సాగాలన్నారు. ఈ వేసవికాలంలో 44 నుండి 45 డిగ్రీల సెంటిగ్రేడ్ల వరకు ఉష్ణోగ్రత భరించాల్సి వస్తుందని, దీనికి కారణం నగరంలో చెట్ల సంఖ్య తక్కువగా ఉండడమేనన్నారు. కావున అధిక సంఖ్యలో చెట్లను పెంచి పరిసరాలన్నింటినీ పచ్చదనంతో నింపితే వేడిమి నుంచి ఉపశమనం కలుగుతుందని చెప్పారు. ముఖ్యంగా డాక్టర్లు, హాస్పిటల్ నిర్వాహకులు, విద్యాసంస్థల అధిపతులు, వ్యాపార సంస్థల నిర్వాహకులు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్వీకరించి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో ఉన్న ఖాళీ స్థలం మున్సిపల్ కార్పొరేషన్ వారికి సంబంధించిన రోడ్లకు ఇరువైపున ఉన్న స్థలంలో చెట్లను నాటి వాటి సంరక్షణను ఆ కాలనీవాసులు బాధ్యతగా చేపట్టాలని కోరారు. తమతో కలిసి పని చేయాలనుకునేవారు 08518-255130, కర్నూల్ డిస్ట్రిక్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (కెడిడిఒ) కర్నూలు జిల్లా అభివృద్ధి సమాఖ్యను సంప్రదించాలని కోరారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - సి.బెళగల్ : మండలంలోని గుండ్రేవుల వద్ద పోలకల్ వాసి గరక నారాయణ తెలంగాణా మద్యం అక్రమంగా తరలిస్తుండగా బెళగల్ ఎస్సై తిమ్మారెడ్డి సోమవారం పట్టుకున్నారు. తనిఖీలలో భాగంగా పోలీస్ సిబ్బంది సమక్షంలో నారాయణను అదుపులోకి. తీసుకుని 96 టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకొన్నారు. అక్రమ ఇసుక, అక్రమ మద్యం అమ్మితే ఎంతటివారికైనా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

విరమణ పొందిన ట్రాఫిక్ ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీసుశాఖలో పని చేసి విరమణ పొందిన కర్నూలు ట్రాఫిక్ ఎస్సై టిఎస్ఎస్ ప్రసాద్ కుమార్‌ను సోమవారం కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ శాలువా, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీసుశాఖకు ప్రసాద్ కుమార్ అందించిన సేవలను కొనియాడారు. కుటుంబాలతో సంతోషంగా గడపాలన్నారు. విరమణ తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. ప్రసాద్ కుమార్ స్వస్థలం కర్నూలు. 1980లో పోలీసు శాఖలో చేరారు. 2020లో ఎస్సైగా పదోన్నతి పొందారు. రైల్వే, డిటిసి, ట్రాఫిక్ పిఎస్‌లలో పని చేశారు. పోలీసుశాఖలో 44 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు , ఎస్సై కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎస్‌పి కృష్ణకాంత్

చదరంగంలో మద్దికెర విద్యార్థి ప్రతిభ

- ప్రపంచ స్థాయి రేటింగ్ సాధించిన ఉదయ్ కిరణ్

ప్రజాశక్తి - మద్దికెర

చదరంగం ఆటలో మద్దికెరకి చెందిన ఉదయ్ కిరణ్ అనే 12 సంవత్సరాల చిన్నారి అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్నాడు. ప్రస్తుతం విద్యార్థి మద్దికెరలోని ఫ్రెండ్స్ విద్యానికేతన్ స్కూల్లో ఆరవ తరగతి చదువుతున్నాడు. ఉదయ్ కిరణ్ నెల్లూరు పట్టణంలో మస్తానయ్య ఆలిండియా రాపిడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నందు పాయింట్ గెలిచి రాపిడ్ రేటింగ్ 1451 సాధించాడు. గతంలో ఉదయ్ కిరణ్ తండ్రి రామారావు కూడా చదరంగంలో రాణించారు. తండ్రి రామారావు దగ్గర ఉదయ్ కిరణ్ శిక్షణ పొందుతూ ప్రపంచస్థాయి రేటింగ్ సాధించడం పట్ల ఫ్రెండ్స్ విద్యానికేతన్ హై స్కూల్ యాజమాన్యం, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



చెస్ ఆడుతున్న ఉదయ్ కిరణ్

పెన్షన్ డబ్బును కాంట్రాక్టర్లకు మళ్లించిన ద్రోహి జగన్ రెడ్డి : టిడిపి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వికలాంగులకు, వితంతువులకు, అవ్వ తాతలకు, అభాగ్యులకు అందించే పింఛన్ డబ్బులు కాంట్రాక్టర్లకు మళ్లించిన జగన్మోహన్ రెడ్డి ఒక ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారని టిడిపి పాణ్యం అభ్యర్థి గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ మాధవి నగర్ నివాసంలో గౌరు దంపతులు విలేకరులతో మాట్లాడారు. పెన్షన్ల పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు పెన్షన్లు పంపిణీ చెయ్యకుండా చేసి, ప్రతి పక్షాల మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈసి వంకతో పంపిణీ, ఎగ్గొట్టే యత్నం, నిధులు ఇవ్వకుండా విపక్షాలపై దుష్ప్రచారం చేయడంలో జగన్మోహన్ రెడ్డి దిట్ట అన్నారు. చివరి లబ్ధిదారుడి వరకు పెన్షన్ ఇవ్వాల్సిందేనని, అడ్డదారుల్లో అస్మదీయులకు వేలకోట్ల బిల్లులు చెల్లింపు చేసి అవ్వ తాతల పెన్షన్ల డబ్బులు బినామీ కాంట్రాక్టర్లకు దోచిపెట్టె హక్కు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి పాణ్యం అభ్యర్థి గౌరు చరిత రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

'ప్రజాగళం' విజయవంతం పట్ల హర్షం

- పింఛన్ల పంపిణీ టిడిపి సమస్య కాదు : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు 'ప్రజాగళం' విజయవంతం కావడం పట్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రజాగళం యాత్రను మండుటెండల్లో సైతం నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలు, అభిమానులు, నందమూరి బాలకృష్ణ అభిమానులు, జనసేన అభిమానులు విజయవంతం చేశారని తెలిపారు. రాష్ట్రంలో పింఛన్లను వాలంటీర్ల పంపిణీ చేయడం నిలిపేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని చెప్పారు. దీన్ని టిడిపి చేయించందని ప్రచారం చేయడం తగదన్నారు. పింఛన్లను సచివాలయంలో అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపిపై బురద చల్లడం తగదన్నారు. టిడిపి కౌన్సిలర్లు దయాసాగర్, రామదాస్ గౌడ్, రంగస్వామి గౌడ్, సుందర్ రాజు, నరసింహులు, రాజేంద్ర పాల్గొన్నారు.

పొరపాట్లను సరిజేసుకొని ముందుకెళ్దాం

- ఈషా బాషను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోనిరూరల్


ఈషా బాషతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని అందరం కలిసికట్టుగా ముందుకెళ్దామని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆదోని ముస్లిం, మైనారిటీ ప్రముఖుల నివాసాలకు ఎమ్మెల్యే వెళ్లి కలిశారు. గత కొన్నేళ్లుగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి దూరంగా ఉన్న సీనియర్ జర్నలిస్టు, ఎపి, తెలంగాణ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ జిల్లా కన్వీనర్ ఈషా బాష, సీనియర్ న్యాయవాది ఆదోని మజహర్ ఉల్ హక్ స్వగృహాలకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. తనతో కలిసి ఉండాలని కోరారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డికి ఈషా బాష స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. సీనియర్ న్యాయవాది మజహర్ ఉల్ హక్, యువ న్యాయవాది తబ్రేజ్ అనుచరులతో కలిసి వైసిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మూగజీవాల దాహార్తిని తీర్చండి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పశువులు, పక్షుల దాహార్తిని తీర్చాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్ఎల్‌సి కెనాల్ నుంచి పిల్ల కాలువలకు, గుంతలకు, చెరువులకు, వంకలకు నీరు వదిలి జంతువులకు, పశువులకు, పక్షులను కాపాడాలని కోరారు. ఈఏడాది వర్షాలు లేకపోవడం వల్ల గుంతలు, చెరువులు, వంకల్లో నీరు లేక వెలవెలబోతున్నాయని విమర్శించారు. ఈసారి డిసెంబర్‌లోనే ఎల్ఎల్‌సికి నీరు బంద్ చేయడం వల్ల మిరప వేసిన రైతులు గుంతలో ఉన్న నీటిని మోటార్లు పెట్టి ట్యాంకర్ ద్వారా పంటలను రక్షించుకున్నారని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు తాగడానికి డ్యాం నుంచి ఫిబ్రవరిలోనే కాలువలకు నీరు వదిలారని చెప్పారు. ఇప్పటికీ నెల రోజులైందని, ఇరిగేషన్ అధికారులు వంకలకు, చెరువులకు, పిల్ల కాలువలకు నీరు వదిలి అడవుల్లో ఉన్న జంతువులను రక్షించాలని కోరారు. అడవుల్లో నీరు లేకపోవడం వల్ల జంతువులు చనిపోతున్నాయని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి వంకలకు, చెరువులకు, పిల్ల కాలువలకు, కౌతాళం పెద్ద వంకకు కామవరం కాలువ నుంచి నీరు వదిలాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మేలిగిరి ఈరన్న, రైతుసంఘం నాయకులు ఉలిగయ్య, పామన్న, సత్యప్ప, వీరేష్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగలదిన్నెలో తాగునీటికి కటకట

- రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి - నందవరం

ఆర్‌డబ్ల్యుఎస్ శాఖాధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో తాగునీటికి కటకట మొదలైంది. ఐదురోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో గ్రామానికి చెందిన మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ముందస్తు ప్రణాళిక కరువు

ఆర్‌డబ్ల్యుఎస్ శాఖాధికారులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో గ్రామాల్లో తాగునీరు లేక ప్రజల గొంతులు ఎండుతున్నాయి. మండలంలోని నాగలదిన్నె గ్రామంలో న్యూ వరద కాలనీలో ఐదు రోజులుగా తాగునీరు సరఫరా లేదు. మహిళలు చేతి బోరు నీళ్లతో కాలం గడుపుతున్నారు. గతేడాది ఈ కాలనీ పక్కనే జగనన్న కాలనీ ఏర్పాటు చేసి, ఆ కాలనీకి దాదాపు రూ.10 లక్షలతో తాగునీటి సరఫరా కోసం పైపులైన్ ఏర్పాటు చేశారు. ఆ పైపులైన్లు నామమాత్రంగా వేయడంతో నీటి సరఫరా లేక పైపులైన్ వేశారా లేదా అని కాలనీవాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ పైపులైన్ ద్వారా అయినా నీటిని సరఫరా చేయాలని అధికారులు, సర్పంచిని కోరినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే న్యూ కాలనీకి గతేడాది రూ.10 లక్షలు వెచ్చించి పైపులైను, మోటార్లను ఏర్పాటు చేశామని అధికారులు, సర్పంచి భర్త తెలిపారు. రూ.10 లక్షలు ఖర్చు చేసినా కాలనీలో మాత్రం ఇప్పటి వరకు తాగునీటి సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. అధికార పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచి భర్త, మాజీ సర్పంచి పార్టీ మారుతున్నందునే తాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని కాలనీ మహిళలు విమర్శిస్తున్నారు. కనీసం తాగడానికైనా నీటిని సరఫరా చేయాలని ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వైసిపిలోకి 50 కుటుంబాలు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలో వైసిపి మండల సీనియర్ నాయకులు దాట్ల కృష్ణంరాజు ఆధ్వర్యంలో వివిధ పార్టీల్లో ఉన్న 50 కుటుంబాలు వైసిపిలో చేరాయి. సోమవారం వైసిపి యువ నాయకులు దాట్ల సుబ్బరాజు, గురు రాఘవేంద్ర రెడ్డి, గణపతిరాజు, కుమార్ రాజులు వారికి పార్టీ కండువా వేసి వైసిపిలోకి ఆహ్వానించారు. సత్య గౌడ్, గంగాధర్ గౌడ్, మూకయ్య గౌడ్, రాము గౌడ్, చంద్ర గౌడ్, గురురాజ్ గౌడ్, నవీన్ గౌడ్, సత్తి గౌడ్, ప్రసాద్, బసవ వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి అభివృద్ధి కోసం, జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు కృషి చేస్తామన్నారు. వైసిపి నాయకులు, లింగన్న, వసంత్ గౌడ్, మూలేమా నరసింహులు, ఉల్లి గయ్య, గిరి గొట్టయ్య, రాము, మల్లి, రమేష్, వార్డు సభ్యులు ఉపేంద్ర గౌడ్, జంబయ్య, మోదిన్ బాష పాల్గొన్నారు.


వైసిపిలో చేరుతున్న కుటుంబాలు

ఎస్సీ కాలనీలో విరుపాక్షి ప్రచారం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ఎస్సీ కాలనీలో వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి సోమవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిప్పగిరిలో అందరూ కలిసికట్టుగా.. ఏ సమస్యలు వచ్చినా పరిష్కరించుకొని అభివృద్ధిలో పోటీ పడి మండలాన్ని ఆదర్శంగా నిలుపుకుందామని తెలిపారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షిని, మాజీ సర్పంచి సురేష్‌రెడ్డిని సర్పంచి గోవిందురాజులు పూలమాల వేసి సన్మానించారు. వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సర్పంచి దాసరి గోవిందరాజులు పాల్గొన్నారు.

మా కుటుంబాలకు మంచి జరిగింది

ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి వచ్చాక తమ కుటుంబాలకు మంచి జరిగిందని, అందుకే వారికి అండగా నిలవాలని వైసిపి చేరుతున్నట్లు పలువురు తెలిపారు. నియోజకవర్గంలోని పెద్ద హోతూరు గ్రామానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు, హాలహర్వి మండలం బాపురం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు చిప్పగిరిలోని విరుపాక్షి స్వగ్రహానికి వచ్చి ఆయన సమక్షంలో వైసిపిలో చేరాయి. పెద్దహోతూరు గ్రామానికి చెందిన సురేంద్ర, ఉరుకుంద, ఉచ్చీరప్ప, శ్రీనివాసులు, వెంకటేష్, వీరేష్, రామాంజనేయులు, చెన్నప్ప, గోవిందు, సుధాకర్, మల్లప్ప, తాయప్ప, కృష్ణలు వైసిపిలో చేరారు. విరుపాక్షి మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్నో కుతంత్రాలు చేస్తాయని, వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని జగనన్నకు అండగా నిలబడాలని కోరారు. ఆలూరు నుంచి మంచి మెజార్టీతో గెలిపించాలని తెలిపారు.



కండువాలు వేసి వైసిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- వ్యకాస, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

వ్యవసాయ పనుల కోసం టాటా ఏస్ వాహనంలో వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యకాస, రైతు సంఘం జిల్లా నాయకులు కె.లింగన్న, పి.హనుమంతు డిమాండ్ చేశారు. సోమవారం హులేబీడు గ్రామంలోని మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హులేబీడు గ్రామం నుంచి చిప్పగిరి మండలానికి వ్యవసాయ పనుల నిమిత్తం కూలీలు వెళ్లారని తెలిపారు. తిరిగి వస్తుండగా హత్తిబెళగల్ గ్రామ సమీపంలో టాటా ఏస్ ఆటో టైర్ పగిలి బోల్తా పడిందని చెప్పారు. ఈ ఘటనలో చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందారని తెలిపారు. మరో 20 మందికి గాయాలయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు మండలంలోని అధికారులు ఎవరూ బాధిత కుటుంబాలను పరామర్శించలేదని తెలిపారు. జిల్లాలోని అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఆలూరు నియోజకవర్గం ఉందని, ప్రతేడాది నియోజవర్గంలో కరువు బారిన పడి ప్రమాదాల్లో 20 నుంచి 30 మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. దీనికి ప్రధాన కారణం ఆలూరు ప్రాంతంలో సాగు, తాగునీరు లేకపోవడమేనని తెలిపారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆలూరు ప్రాంత తాగు, సాగునీటి సమస్య తీరడం లేదని అన్నారు. అధికారులు స్పందించి సాగునీటి సమస్యపై స్పందించి వేదవతి, నగరడోన రిజర్వాయర్లను పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలని కోరారు. గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం బిల్లులు నెలలు గడిచినా రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే దుస్థితి వచ్చిందని తెలిపారు. ఉపాధి కూలిలు సక్రమంగా ఇస్తే గ్రామాల్లోనే పని చేసుకుని జీవించే పరిస్థితి ఉండేదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రతేడాది ఇటువంటి ప్రమాదాలు వందల సంఖ్యలో జరుగుతున్నాయని తెలిపారు. ఆటో ప్రమాదంలో మృతి చెందిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం తరపున రూ.25 లక్షల పరిహారం అందించాలని, క్షతగాత్రులకు రూ.లక్ష అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి వైఎస్ఆర్ బీమా డబ్బులు వెంటనే అందించాలని కోరారు. వ్యకాస తాలూకా నాయకులు కృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి యు.ఈరన్న పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న వ్యకాస, రైతు సంఘం నాయకులు

వసతి, నీటి కొరత ఉందనేది అవాస్తవం

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి కొలువైన మంత్రాలయంలో భక్తులకు వసతి, నీటి కొరత ఉందనేది అవాస్తవమని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీమఠం ఆవరణలో నీరు లేదని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ప్రచారం చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అది అవాస్తవమని చెప్పారు. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆశీస్సులతో, శ్రీమఠం అధికారులు అన్ని అవసరాలకు తగినంత నీటి సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. భక్తులు ఎలాంటి సందేహమూ లేకుండా మంత్రాలయ క్షేత్రానికి రావచ్చని చెప్పారు. గదుల కోసం ఆన్‌లైన్ సౌకర్యం కొన్ని గదులకు మాత్రమే అందించామని, ఈ ఆన్‌లైన్ గదులు కాకుండా భక్తుల సౌకర్యార్థం 1000 గదులు ఆఫ్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని భక్తులకు నిబంధనల మేరకు ముందుగా వచ్చిన వారికి కేటాయిస్తామని చెప్పారు. నేటికీ అందుబాటులో ఉన్న మొత్తం గదులు 1200 కాగా అందులో 1000 గదులు ఆఫ్‌లైన్‌లో ఉన్నాయని తెలిపారు. మంత్రాలయం సందర్శన కోసం వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గంజి పడి విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న బాలుడు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని గజహల్లి గ్రామంలో అంగన్వాడీ ఆయా నిర్లక్ష్యం వల్ల గంజి పడి ఐదేళ్ల బాలుడు మల్లప్పకు గాయాలయ్యాయి. అంగన్వాడీ సెంటర్-2లో పని చేస్తున్న ఆయా లక్ష్మి సోమవారం విద్యార్థుల కోసం వంట వండిన గంజిని అంగన్వాడీ కేంద్రంలో చదువుకుంటున్న మల్లప్ప అటు నుంచి మూత్రవిసర్జనకు వెళ్లి వస్తుండగా విసిరినట్లు తెలిసింది. చూసుకోకుండా పొరపాటున విసిరినట్లు ఆయా తెలిపారు. 'అంత నిర్లక్ష్యంగా ఎలా విసురుతావు' అంటూ విద్యార్థి తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. వెంటనే బాలుని స్థానిక ప్రాథమిక వైద్యశాలకు తరలించగా.. గాయాలు ఎక్కువ కావడంతో మెరుగైన వైద్య కోసం ఆదోని ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు పేర్కొంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు .

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

కూలి పనులు చేసుకోవడానికి ఆటోలో ప్రయాణిస్తూ మాల లక్ష్మి (32) అనే మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మృతురాలు లక్ష్మి భర్త బసవరాజు వివరాల మేరకు... ఆదోని మండలం చాగి గ్రామానికి చెందిన బసవరాజు కుటుంబం రోజూ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగించేవారు. సోమవారం ఉదయమే కూలి పని నిమిత్తం చిప్పగిరి గ్రామానికి వచ్చారు. అక్కడి నుంచి మిరపకాయలు తెంచేందుకు ఆటోలో బయల్దేదారు. చిప్పగిరి సమీపంలోని పంపు హౌస్ దగ్గర ఆటో అధిక వేగంగా వెళ్లడంతో ఆటోలో వెనుక భాగాన కూర్చున్న లక్ష్మి కింద పడ్డారు. ఆమె తలకు బలమైన గాయం కావడం, ముక్కులో రక్తం రావడం వల్ల అక్కడికక్కడే మృతి చెందారు. చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు


పెద్దకడబూరులో సిఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు ఆధ్వర్యంలో ఈస్టర్ పండగ సందర్భంగా సోమవారం బండలాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. టిడిపి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి మండల నాయకుల సహకారంతో పోటీలు నిర్వహించారు. ముందుగా పాస్టర్ ముత్తు మనోహర్ బాబు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ జెసిఎస్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, నరవ రాజశేఖర్ రెడ్డి, విజయేంద్రరెడ్డి, జాము మూకయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. బండలాగుడు పోటీల్లో మొత్తం 13 జతల కాడెద్దులు పాల్గొన్నాయి. ఇందులో అనంతపురం జిల్లాకు చెందిన ఓబులపతి ఆచారి కాడెద్దులు 20 నిమిషాల్లో 7,200 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. కర్నూలుకు చెందిన గుడేకల్ దాస్ కాడెద్దులు 6,000 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలువగా, నంద్యాలకు చెందిన ఆళ్ల మదన్ మోహన్ రెడ్డి కాడెద్దులు 5,858 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన కాడెద్దుల యజమానులకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలను రాంపురం రెడ్డి సోదరులు, వైసిపి మండల నాయకుల తరపున వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, వైసిపి నాయకులు నవీన్ రెడ్డి, బ్రహ్మయ్య ఆచారి, ముక్కరన్న, అర్లప్ప చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. బండలాగుడు పోటీల్లో పని చేసిన వాలంటీర్లకు గుమ్మల రాజేష్ టీ షర్ట్స్ విరాళంగా అందజేశారు. నిర్వాహకులు బొగ్గుల జోసఫ్, జె.జాన్, ఎం.మనోహర్, వైసిపి నాయకులు ప్రసాద్, ఏసన్న, కుమార్, సుందరరాజు, సుధాకర్, లోకయ్య పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ప్రదీప్‌రెడ్డి

అధికారంలోకి రాగానే గ్యారంటీల అమలు

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్

ప్రజాశక్తి - ఆదోని


మాట్లాడుతున్న దేవిశెట్టి ప్రకాష్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 9 గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎమ్ఎమ్‌డి.నూర్ తెలిపారు. సోమవారం పట్టణంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రానికి పదేళ్ల ప్రత్యేక హోదా, మహిళా మహాలక్ష్మి కింద ప్రతి పేద మహిళకూ ప్రతినెలా రూ.8,500, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, పెట్టుబడి కింద 50 శాతం లాభంతో కొత్త మద్దతు ధర కల్పిస్తామని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కింద కూలీలకు కనీస వేతనాలు, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.25 లక్షల ఉద్యోగాల భర్తీ, ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికీ మహిళ పేరు మీద రూ.5 లక్షలతో పక్కా ఇళ్లు, ఇంట్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.4 వేల పింఛను, వికలాంగులకు రూ.6 వేల పింఛను ఇస్తామని చెప్పారు. సీనియర్ నాయకులు కుప్పగల్ అయ్యప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షులు నెట్టేకల్ హనుమంతు, జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శి మహ్మద్, ఆదోని మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు నిసార్ అహ్మద్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు దాదా కలందర్, అసదుల్లా, అల్తాఫ్ హుస్సేన్, సిరాజ్ పాల్గొన్నారు.

ఆదోనిలో పోలీసు కవాతు

ప్రజాశక్తి - ఆదోని


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివ నారాయణ స్వామి పర్యవేక్షణలో సోమవారం ఆదోని పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. సెంట్రల్ ఫోర్స్, ఎస్ఎస్‌బి పోలీసులు ఆదోనిలోని భీమాస్ సర్కిల్, ఫరీద్‌సా మొహల్లా, మట్కార్‌గేరి, చిన్న మార్కెట్, చందసా దర్గా, మీదుగా ఎస్‌కెడి కాలనీ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వేసేందుకు భరోసా కల్పించడమే ఈ ఫ్లాగ్ మార్చ్ ఉద్దేశ్యమని డీఎస్పీ తెలిపారు. ఎస్ఎస్‌బి అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్, టూ టౌన్ సిఐ గోపి పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఆదోని


నగదు, నిందితుని చూపుతున్న డీఎస్పీ

మండలంలోని ఢణాపురం సమీపంలో పాడుబడ్డ ఇందిరమ్మ గృహాల వద్ద క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ నాటుసారా అమ్ముతున్న పట్టణానికి చెందిన బోయ ఆంజనేయులును అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివ నారాయణ స్వామి తెలిపారు. సోమవారం అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వ్యక్తి నుంచి 2 సెల్ ఫోన్లు, రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో సిఐలు తేజా మూర్తి, నరసింహరాజు, నిరంజన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో 'విక్టరి' ప్రభంజనం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత జనవరి 20న జరిగిన 6వ తరగతి నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పట్టణానికి చెందిన విక్టరి నవోదయ శిక్షణ కేంద్రం నుంచి 35 మంది ఎంపికయ్యారని శిక్షణ కేంద్రం డైరెక్టర్ చాంద్ బాష తెలిపారు. ఎంపికైన వారికి త్వరలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడారు. వరుసగా గత 20 ఏళ్లకు పైగా కర్నూలు జిల్లాలోనే కాక ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోనూ ఎవరికీ సాధ్యం కాని సీట్లను సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రంలో కొన్ని తప్పులు దొర్లినప్పటికీ, అనువాద దోషాలు ఉన్నప్పటికి ఈఏడాది కూడా మంచి ఫలితాలు రావడం పట్ల సంతోషాన్ని వెలిబుచ్చారు. విద్యార్థుల కృషి, పట్టుదల, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావంతోనే ఈ ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ ఫలితాలు తమలో మరింత బాధ్యతను పెంచుతున్నాయని చెప్పారు. ఇటీవల విడుదలైన సైనిక్ పాఠశాలల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ చాలా మందికి మంచి మార్కులు వచ్చాయని తెలిపారు. వారిలో వివిధ రౌండ్లలో దాదాపు 10 మంది వరకు సైనిక్ పాఠశాలల్లో సీట్లు వస్తాయని చెప్పారు. అకాడమిక్ సలహాదారు ఖాజాబాష, ఉపాధ్యాయులు వికాస్, అనిల్, రవి, పాపన్న, ఖాజా మోయినుద్దీన్, రాజశేఖర్, రజని, హాస్టల్ నిర్వాహకులు కంబగిరి స్వామి, గౌరి, మహాలక్ష్మి, పుణ్యవతి పాల్గొన్నారు.


ఫలితాలు సాధించిన విద్యార్థులు



ఆస్పరిలో విద్యార్థులు అభినందిస్తున్న సిబ్బంది

ఆస్పరి : నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షల్లో నారాయణ ప్రైమ్ స్కూల్ విద్యార్థులు విజయ కేతనం ఎగుర వేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ ఆచారి తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే సంవత్సరానికి నవోదయ గురుకుల ప్రవేశ పరీక్షకు విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. నవోదయలో చరిత అనే విద్యార్థిని, గురుకుల పరీక్షల్లో కావ్య, విష్ణు, విష్ణు ప్రియ, హర్ష, కీర్తన, శ్రీనిధి, మనస్విని, శేషాద్రి, అక్షర, హిందూ మొత్తం 14 మంది ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ఇంతటి విజయానికి సహకరించిన విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల డైరెక్టర్ దీప్తి, అకాడమిక్ డీన్ సతీష్ కుమార్, ఉపాధ్యాయులు ఈశ్వర్, గాయత్రి, రమాదేవి, బాలు, రేష్మ, పద్మావతి, శ్రీదేవి, గంగమ్మ, సంజన్న, నారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామంలోని జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన కీర్తన అనే విద్యార్థిని నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు కరస్పాండెంట్ తిప్పన్న, ప్రధానోపాధ్యాయులు పావని తెలిపారు. సోమవారం ఆ విద్యార్థినికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అభినందన సభ ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.


అభినందనలు తెలుపుతున్న ప్రధానోపాధ్యాయులు పావని





వ్యాపార సంఘాలు ట్రేడ్ యూనియన్ల నాయకులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

సమస్యలపై మౌనరాగం

- మొక్కుబడిగా సిఎం 'మేమంతా సిద్ధం' - వ్యక్తమవుతున్న విమర్శలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి సమస్యలపై మౌనరాగం వహిస్తూ ముందుకు సాగారు. ఆయన చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర మొక్కుబడిగా సాగింది. జిల్లాకు ఏం చేస్తామో చెప్పకుండా యాత్ర చేయడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి...

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో చేపట్టిన బస్సు యాత్రతో రెండు రోజుల పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తొలి రోజు బస్సు యాత్ర ప్రారంభమైంది. సిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో గ్రామస్తులతో జగన్ ముఖాముఖి నిర్వహించారు. గ్రామానికి వైసిపి ప్రభుత్వం చేసిన వాటి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం యాత్ర నంద్యాలకు చేరుకుంది. నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో జగన్ జిల్లాకు ఎలాంటి హామీల ఊసే ఎత్తలేదు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నంద్యాలను మున్సిపల్ కార్పొరేషన్‌గా చేయాలని, నంద్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని, రింగ్ రోడ్డు ఇవ్వాలని ప్రతిపాదించినా జగన్ వాటి ప్రస్తావన తీసుకు రాలేదు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర రెండో రోజు కర్నూలు జిల్లాలో సాగింది. కర్నూలు జిల్లా పెంచికలపాడు నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. కోడుమూరులో జగన్ చేనేతలతో మాటా మంతీ నిర్వహించారు. కైరవాడి, గోనెగండ్ల, రాళ్లదొడ్డి మీదుగా ఎమ్మిగనూరు వరకు యాత్ర సాగింది. ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ ప్రసంగంలోనూ హామీలను ప్రస్తావించలేదు. జిల్లాకు ఏం చేస్తామో చెప్పలేదు. ఎమ్మిగనూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక నీటి సమస్య నివారణ కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించాలని, చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరినా వాటి మీద కూడా జగన్ స్పందించలేదు.



గుండ్రేవుల ఏదీ..?

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి గుండ్రేవుల ప్రాజెక్ట్‌ను నిర్మిస్తానని 2017 నవంబరు 27న జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. 2019లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నిధులను కేటాయించారు. ఆ తర్వాత ఎన్నికల్లో టిడిపి ఓడింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా తాజా పర్యటనలోనూ ముఖ్యమంత్రి గుండ్రేవుల ఊసే ఎత్తలేదు.

నీటిని మరిచారు

దశాబ్దాలుగా కోడుమూరు ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. వైసీపీ అధికారం చేపట్టి నెల రోజులకే గాజులదిన్నె నుంచి పైప్‌లైన్ ద్వారా కోడుమూరుకు తాగునీరు తెస్తామని, సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను నిర్మిస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ పట్టించుకోలేదు. ఎల్లెల్సీని ఆధునికీకరించి, ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆదోని, ఆలూరు ప్రాంత ప్రజాలకు హామీ ఇచ్చారు. ఆదోని పట్టణ జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒక్కటీ నెరవేరలేదు. ఆలూరు నియోజకవర్గంలో శాశ్వత సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి వేదవతి ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు.

15 ఏళ్లుగా శంకుస్థాపనకే పరిమితమైన నగరడోన రిజర్వాయర్ నిర్మించి చిప్పగిరి, ఆలూరు ప్రాంతాల్లో 4,200 ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏదీ నెరవేరలేదు. కెసి ఆయకట్టు స్థిరీకరణ కోసం సాగునీటి వనరులను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు. ఈ సమస్యలపైనా సిఎం ఎక్కడా మాట్లాడలేదు.

ఆగని వలసలు

వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. దీంతో జిల్లాలో వలసలు ఆగడం లేదు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల నుంచి ఏటా వలసలు కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జిల్లా నుంచి 2 లక్షల మంది వలస వెళ్తున్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో ఎక్కడా వలసల గురించి ప్రస్తావించలేదు.

రూ. 50 వేలకు మించితే

ఆధారాలు తప్పనిసరి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో 50 వేల రూపాయల మించి నగదు తీసుకొని వెళితే సంబంధిత రశీదు, ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని వ్యాపార సంఘాలు, ట్రేడ్ యూనియన్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఏ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 50 వేల రూపాయల మించి నగదు తీసుకొని వెళితే సంబంధిత రశీదు, ఆధారాలు తప్పనిసరిగా ఉండాలని, ఎవరికి మినహాయింపు ఉండదని, ఇందుకు వ్యాపార సంఘాలు, ట్రేడ్ యూనియన్లు అందరూ సహకరించాలని కోరారు. నగదుకు సంబంధించిన బిల్లులు, రిసిప్ట్ ఓచర్లు, పేమెంట్ ఓచర్లు సంబంధిత వివరాలన్నీ ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామవళిలో భాగంగా 29 రకాల వస్తువులు అధిక సంఖ్యలో కొనుగోలు చేసి డిస్ట్రిబ్యూషన్ జరిగితే సంబంధిత వస్తువులను సీజ్ చేస్తామని వివరించారు. 20 లక్షల వార్షిక టర్నోవర్ కలిగిన వ్యాపారస్తులు (సర్వీసెస్) తప్పనిసరిగా జిఎస్టి రిజిస్ట్రేషన్ తీసుకోవాలన్నారు. 40 లక్షల వార్షిక టర్నోవర్ కలిగిన వ్యాపారస్తులు (గూడ్స్‌పై) తప్పనిసరిగా జిఎస్టి రిజిస్ట్రేషన్ తీసుకోవాలన్నారు.

వ్యాపార సంబంధిత నగదు రవాణా చేస్తే టాక్స్ ఇన్ వాయిస్, బిల్లు డెలివరీ, చలానా పేమెంట్ ఓచర్స్ అందుబాటులో ఉంచుకో వాలన్నారు. సరుకు రవాణా చేస్తే ట్యాక్స్ ఇన్వాయిస్, వ్యాలిడ్ ఈ వేబిల్ ఉండాలన్నారు. అధిక మొత్తంలో నగదు, లిక్కరు, ఓటర్లను ప్రలోభపర్చే సామాగ్రి అక్రమ తరలింపుపై పూర్తి స్థాయిలో నిఘా ఉంటు ఽదన్నారు. ఈ అంశానికి సంబందించి ఐటి, జిఎస్‌టి, పోలీస్, ఎక్సైజ్ తదితర 22 ఎన్ఫోర్సుమెంట్ ఏజెన్సీలు నిరంతరం పని చేస్తున్నాయని వివరిం చారు. బ్యాంకు ఖాతాల ద్వారా అనుమానాస్పద, అధిక మొత్తంలో జరిగే లావాదేవీల వివరాలు ఎప్పటికప్పుడు ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలన్నారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల జిల్లాలో ఈ నెల 1 వ తేదీ నుండి10వ తరగతి స్పాట్ వాల్యుయేషన్ ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కే. సుధాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్యుయేషన్‌కు సంబంధించి దాదాపుగా రెండు లక్షల పేపర్లు రావడం జరిగినదని,స్పాట్ వాల్యుయేషన్ కొరకు 120 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 720 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా, 200 మంది స్పెషల్ అసిస్టెంట్‌లుగా నియామి ంచినట్లు ఆయన వెల్లడించారు.

1040 ఎగ్జామినర్లకు అవసరమైన మంచినీటి వసతి, మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశామని,పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఇఒ తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మొదటి రోజు స్పాట్ వ్యాల్యుయేషన్ పూర్తిచేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటనలో తెలిపారు.

వేసవి ఉష్ణోగ్రతలపై అప్రమత్తంగా ఉండాలి

- వడదెబ్బ తగలకుండా స్వీయ జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రోజురోజుకు వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉంటూ స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వడదెబ్బ నివారణ చర్యలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కే రఘువీర్ రెడ్డి, డిఆర్ఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మున్సిపాలిటీల్లో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్న ప్రదేశాలలో చలువ పందిళ్ళు వేయాలన్నారు. గుర్తించిన ప్రదేశాల్లో చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. అకస్మాత్తుగా వడదెబ్బకు గురైన బాధితులకు అత్యవసర వైద్యం అందించేందుకు పట్టణంలో ప్రధాన కూడళ్లలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వడదెబ్బకు గురైన వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి అత్యవసర మెడిసిన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధి హామీ పథక కింద పనులు చేపట్టే ప్రదేశాలలో షెడ్ నెట్స్, తాగునీటి సదుపాయం కల్పించాలని డ్వామా పిడిని ఆదేశించారు. గ్రామాలలో తాగునీటికి ఇబ్బంది ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని నీటి సదుపాయం కల్పించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో విద్యుత్ కొరత ఏర్పడకుండా నిరంతర సరఫరా చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు.

ఎన్నికల ఎఫెక్ట్...

- 1వ తారీకు అందని పెన్షన్‌లు
- 3 నుండి లబ్ధిదారులకు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సామాజిక పింఛన్ల పంపిణీకి గ్రామ, వార్డు వాలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో ఎన్నికల ఎఫెక్ట్ పింఛన్‌దారులపై పడింది. నంద్యాల జిల్లాలో 2 లక్షల 24 వేల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. అందులో వృద్ధాప్య పెన్షన్లు, వికలాంగులు, వితంతు పెన్షన్‌లతో పాటు, చేనేత, మత్స్యకార పెన్షన్లు ఇలా 16 రకాల పెన్షన్‌లను ప్రతినెలా వాలంటీర్ల ద్వారా ఒక్కటో తారీకు నుండి 5,6 తేదీలా లోపల ప్రభుత్వం ఇస్తుంది. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎన్నికల కమిషన్ వాలంటీర్లను పక్కన పెట్టాలని ఆదేశాలు ఇవ్వడంతో ఒక్కటో తారీఖు పెన్షన్‌లు లబ్ధిదారులకు అందలేదు. ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 16న ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చింది. వాలంటీర్లను తొలగిస్తారని అధికారులకు అంచనా ఉన్నప్పటికీ దాదాపు 14 రోజులు వ్యవధి వున్న సెర్ప్ అధికారులు ప్రత్యామ్నాయం చర్యలు తీసుకోకపోవడంపైన విమ ర్శలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

3వ తేదీ నుండి పెన్షన్‌లు పంపిణీ

ఈ నెల 3 నుండి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసుకుంటుంది. ఎన్నికల నేపథ్యంలోలో ఎన్నికల ప్రవర్తనా నియామవాళి అమలులో ఉన్నందున పెన్షన్‌ల పంపిణీ నుండి వాలంటీర్లు పాల్గొనకూడదని ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే.. అయితే అందుకు ప్రత్యామ్నాయంగా వార్డ్, గ్రామ సచివాలయం సిబ్బంది ద్వారా పంపిణీ చేయాలని సెర్ప్ సీఈఓ ఆదేశాలు ఇచ్చారు. ఈ పంపిణీ పక్రియ ఈ నెల 3వ తేదీ నుండి ప్రారంభించనున్నారు. పెన్షన్‌లను దగ్గరలో ఉన్న సచివాలయాల వద్దకు వెళ్లి లబ్ధిదారులు పెన్షన్ పొందాలని సెర్ప్ సీఈఓ ఆదేశాలిచ్చారు. పెన్షన్ తీసుకోవడానికి లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు కానీ లేక ఏదైనా గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని



సూచించారు. అక్కడి వరకు బాగానే ఉంది మరి అవ్వ తాతలు, వికలాంగుల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. వారు నడవలేని స్థితిలో ఉంటారు. నంద్యాలలో దాదాపు 10 నుంచి 13 సచివాలయాలు మొదటి అంతస్తు పైన ఉన్నాయి. వృద్ధులు, వికలాంగులకు ఇబ్బంది కలిగే అవకాశం లేక పోలేదు. మొదటి అంతస్తులో ఉన్న సచివాలయాల దగ్గర వికలాంగులు, వృద్ధులకు సచివాలయ సిబ్బంది క్రిందికి వచ్చి పింఛన్లు పంపిణీ చేసేలా చర్య తీసుకోవాలని వికలాంగ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. నడవలేని వృద్ధులు కూడా సచివాలయాలకు వెళ్లాల్సిందేనా....వీరికి మినహాయింపు లేదా అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి అవ్వ తాతలకు, దివ్యంగులకు పెన్షన్ అందించాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, వికలాంగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వికలాంగులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- డిపి మస్తాన్ వలి, డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎపి వ్యవస్థాపక అధ్యక్షులు.



సామాజిక పెన్షన్ల పంపిణీలో వికలాంగులకు ఇబ్బంది కలగకుండా మొదటగా వికలాంగులకు పెన్షన్లు పంపిణీ చేయాలి. సచివాలయ సిబ్బంది కూడా వికలాంగులకు ఇబ్బంది పెట్టకుండా పెన్షన్లు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వికలాంగులకు ముందుగా పెన్షన్లు పంపిణీ చేయాలి.

పెన్షన్లు సకాలంలో అందేటట్లు చూడాలి

- పుల్లా నరసింహ, పట్టణ కార్యదర్శి, సిపిఎం.



వాలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ నిలిపి వేయడం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, సకాలంలో వృద్ధులు, మహిళలు వికలాంగులకు పెన్షన్లు అందించాలి. గ్రామ, వార్డు సచివాలయం, రెవెన్యూ ఉద్యోగుల సేవలను ఉపయోగించుకొని గతంలో లాగానే నేరుగా పెన్షన్ దారులకు పెన్షన్లు అందించాలి. వాలంటీర్ వ్యవస్థను రాజకీయ అవసరాల కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దుర్వినియోగం చేయడంతోనే నేడు సకాలంలో పెన్షన్లు అందించలేని పరిస్థితి.



వేంపెంట గ్రామంలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- కబడ్డీ పోటీలను ప్రారంభించిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని వైసీపీ రాష్ట్ర యువజన అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. సోమవారం పాములపాడు మండలం వేంపెంట గ్రామంలో ఈస్టర్ సందర్భంగా మాల యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సీనియర్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసీపీ రాష్ట్ర యువజన అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగల సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించడం ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయమని, యూత్ ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. క్రీడలు ఐక్యతను పెంచుతాయని, యువత క్రీడల్లో రాణించాలని కోరారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు జి రామలింగేశ్వర్ రెడ్డి, తాలూకా నాయకులు వై.చంద్రమౌళి, సింగిల్ విండో సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ వరప్రసాదరావు, నాయకులు విజయసింహారెడ్డి, టీ నాగరాజు, ఎల్వి రమణారెడ్డి, మధుసూదన్ రావు, చౌడయ్య, మాలిక్ భాష, బంగారం భాష, చలమారెడ్డి, యేసురత్నం, భాస్కర్, సమ్మద్, అంబయ్య, ప్రభాకర్, అంబన్న, బాలు నాయక్, ఓబుల్ రెడ్డి, స్వామి దాసు, శివలింగం ఓబన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాలలో విజయానికేతన్ జయకేతనం

ప్రజాశక్తి - పాణ్యం : జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో విజయాని కేతన్ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం నవోదయకు ఎంపికైన డేవిడ్ విక్టర్,అభిలాశిత,గౌతం తేజ్, భరత్ కుమార్‌లను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. వరుసగా సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించడం చక్కటి ప్రణాళిక,మంచి క్రమ శిక్షణతో సాధ్యం అయిందని విజయ్ కుమార్ రెడ్డి అన్నారు.



నవోదయ కు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్

వ్యాపారస్తులపై దాడులు సరైందికాదు : సిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని వ్యాపారస్తులపై పోలీసులు ఇటీవల దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేసి వాళ్ళ దగ్గర ఉన్న సొమ్మును తీసుకువెళ్లడం సరైంది కాదని, వెంటనే వారి సొమ్మును ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే.మహమ్మద్ గౌస్, లక్ష్మణ్, పి.వెంకట లింగంలు డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి రోజువారీగా వేలాది మంది ప్రజలు నిత్యం తిరుగుతుంటారని, ఉగాది, రంజాన్ పండుగలు వస్తున్న సమయంలో వ్యాపారం బాగా జరిగి ఇంటికి వెళ్లే సందర్భంలో షాప్‌లో డబ్బులు పెట్టుకుంటే దొంగల భయంతో ఇంటికి తీసుకెళ్తుంటారని, పోలీసులు చెక్ చేసి వ్యాపారుల దగ్గర ఉన్న సొమ్మును సీజ్ చేయడం సరైనది కాదన్నారు. వెంటనే తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. పోటీ చేసే అభ్యర్థులపై నిఘా ఉంచాలని, వ్యాపారులపై, ప్రజలపై ఇలాంటి దాడులు చేయడం సరైనది కాదన్నారు. వ్యాపారులకు సీజ్ చేసిన అమౌంటును తిరిగి జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపారులు చేసిన బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, రాబోయే కాలంలో వ్యాపారులు చేసే పోరాటానికి సిపిఎం ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న గౌస్

ఇబ్బందులున్న ఉపాధ్యాయులకు

ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వండి : ఎస్‌టియు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రత్యేక ఇబ్బందులు ఉన్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ నాయకులు జిల్లా రెవిన్యూ అధికారి పద్మజను కోరారు. సోమవారం ఎస్టీ యూ నంద్యాల జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి డి.మౌలాలి,అజాం బేగ్, రాష్ట్ర మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి జి. వి.ప్రసాద్ రెడ్డిలతో కూడిన ప్రతినిధి బృందం డిఆర్‌ఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు డిఆర్‌ఓ పద్మజతో నాయకులు మాట్లాడుతూ సాధారణ ఎన్నికల విధులకు సంబంధించి ఉపాధ్యాయులను ప్రిసైడింగ్ అధికారులు గా, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా నియమించి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో మొదటి దశ శిక్షణ కూడా పూర్తి కావడం జరిగినదన్నారు. ఎన్నికల సంఘం నిబందలన ప్రకారం వికలాంగులుగా ఉపాధ్యాయులకు, కిడ్నీ ఊపిరితిత్తుల లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో భాద పడే ఉపాధ్యాయులకు,చిన్న పిల్లల తల్లులకు,పదవీ విరమణకు సమీపంలో ఉన్న ఉపాధ్యాయులకు ,ప్రమాదాలలో గాయాలపాలై శాస్త్ర చికిత్సలు చేయించుకున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఉన్నప్పటికి సంబంధిత రిటర్నింగ్ అధికారాలు ఏమాత్రం స్పందించక పోవడం శోచనియమన్నారు. ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన డిఆర్‌ఓ పద్మజ నాయకులతో మాట్లాడుతూ రెండవ దశ శిక్షణనాటికి మినహాయింపు కొరకు సంబంధిత రిటర్నింగ్ అధికా రులకు ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మండల అధ్యక్షుడు శ్రీనిశాస రావు జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డిఆర్‌ఓ పద్మజకు వినతి పత్రం అందజేసిన ఎస్‌టియు నాయకులు

3 నుండి పింఛన్ల పంపిణీ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వెలుగోడు

ఏప్రిల్ 3వ తేదీ నుండి పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వెలుగోడు పట్టణంతో పాటు అన్ని గ్రామాలలోని సచివాలయాల సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. పింఛన్‌దారులు తమ సచివాలయాల వద్దకు వెళ్లి పింఛన్‌లను తీసుకోవాలని కోరారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు :సుండిపెంట కాలనీలోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో, హాస్టల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై. ఆశీర్వాదం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కుకింగ్ హెల్పర్స్‌కు, పారిశుధ్యం, ఔట్ సోర్సింగ్‌లో గత 30 సంవత్సరాల నుండి పని చేస్తున్న వారికి 16 నెలల బకాయి జీతాలు చెల్లించాలని, అలాగే కొంత మంది విద్యార్థులకు అమ్మఒడి, విద్యా దీవెన మంజూరు చేయాలని కోరుతూ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎన్.నాగరాణిని మంగళగిరిలో కలిసి వినతిని అందజేసినట్లు తెలిపారు. వినతిని అందజేసిన వారిలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అరుణ, కుమారి, ఎల్.రాజు వున్నారు.

ఉగాది పంచాంగ పుస్తక ఆవిష్కరణ

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవక్షేత్రం మహానంది పుణ్యక్షేత్రంలో మహానంది దేవస్థానం తరపున ప్రచురించిన శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగ పుస్తకాలను ఆలయ కార్య నిర్వహణ అధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మాట్లాడుతూ సశాస్త్రీయ తిథి,వార,నక్షత్ర,యోగ, కరుణాల గణనతో పాటు పండుగలు పర్వదినాల వివరాలు, అనేక వాస్తు,మహూర్త విషయాల సమాహారంతో శ్రీ మహానంది దేవస్థాన సిద్ధాంత పంచాంగమును ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి సమర్పణలో ప్రముఖ సిద్ధాంతి గారైన బ్రహ్మ శ్రీ తంగిరాల వెంకట కృష్ణ ప్రపూర్ణ సిద్ధాంతి (తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి) చే రాయబడిందన్నారు. పండుగలు, పర్వాలు, వారోత్సవ, మాసోత్సవ,సంవత్సరోత్సవాలను మహానంది దేవస్థానం వేదపండితులు చెండూరి రవిశంకర్ అవధానిచే నిక్షిప్తమైనదని, నంద్యాల శ్రీ వీరభద్రస్వామి షాపింగ్ మాల్ యజమానులు పవన్ కుమార్ సహకారంతో ముద్రించబడిందన్నారు. ఈనెల 9న మహానంది క్షేత్రంలో జరిగే ఉగాది పండుగ రోజున పంచాంగ శ్రవణం, అందరికీ పంచాంగ సమర్పణ చేయబడును అన్నారు.



ఉగాది పుస్తక ఆవిష్కరణలో పాల్గొన్న మహానంది ఆలయ ఈవో



నంద్యాల ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

వెంగల్ రెడ్డి పేటలో ప్రబలిన విష జ్వరాలు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని వెంగల్ రెడ్డిపేట గ్రామంలో విష జ్వరాలు ప్రబలాయి. గ్రామానికి చెందిన మహేష్, మౌనిక, సుమంత్, లక్ష్మీ, మధుతోపాటు దాదాపు 20 మంది పైగా విష జ్వరాల బారిన పడ్డారు. వీరంతా నంద్యాలలోని వివిధ ప్రవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. విష జ్వరాలు సోకిన వారికి ప్లేట్లెట్స్ తగ్గిపోతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. గ్రామంలో విషజ్వరాలు సోకడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విష జ్వరాలకు కారణాలు తెలుసుకొని వైద్యం అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

టిడిపిలోకి భారీగా వలసలు


ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండలంలోని ముష్టేపల్లె గ్రామంలో వైసిపి కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆ పార్టీని వదిలి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సిద్దాపురం చెరువు నిర్మించడం ద్వారా ఈ ప్రాంత రైతులకు గతంలో రెండు పంటలకు సాగునీరు అందించాలని, నేడు ఆ నీరు పంట పొలాల్లో నేడు కరువైందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ ఎప్పుడు అండగా ఉంటుందని, రాబోవు ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వేణుగోపాల్, శివ ప్రసాద్ రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, రామ్ నరసయ్య, జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బుడ్డా సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి
www.prajasakti.com



ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరుతున్న టిడిపి నాయకులు

15 కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో సంజామల మండలం ముదిగేడు గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టిడిపిని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఆదివారం సంజామల మండలం ముదిగేడు గ్రామానికి చెందిన 15 రజక కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరాయి. ముదిగేడు గ్రామానికి చెందిన చాకలి పుల్లన్న, చాకలి మద్దిలేటి, చాకలి బాల పుల్లన్న, చాకలి నాగేంద్ర, చాకలి బాలుడు, చాకలి శేఖర్, చాకలి గురుమూర్తి, చాకలి కంబగిరి, చాకలి సురేష్ ,చాకలి రాముడులు టిడిపిని వీడి వైసీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైసిపి కండువాలు కప్పి పార్టీలోని ఆహ్వానించారు. ముదిగేడు వైసిపి నాయకులు, మండల ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి,ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచ వెంకటరామిరెడ్డి, నాయకులు మైల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గంగుల అవంతికారెడ్డి

గంగుల బ్రిజేంద్రారెడ్డిని గెలిపించాలి

- గంగుల అవంతికారెడ్డి

ప్రజాశక్తి - చాగలమర్రి

ఆళ్ళగడ్డ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గంగుల బిజేంద్రారెడ్డిని గెలిపించాలంటూ ఆయన సోదరి గంగుల అవంతికారెడ్డి మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా అమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను,గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. తన సోదరుడు గంగుల నానికి ఓటు వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.కార్యక్రమం లో ఎంపిపి వీరభద్రుడు,సర్పంచ్ శంకరమ్మ భాయి,వైసీపీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,మాజీ ఎంపిపి మస్తాన్,ఎంపీటీసీ వెంకట రాముడు,వైసీపీ నాయకులు జగదీశ్వర రెడ్డి,శేషు రమేష్,రహమాన్, చాంద్‌బాషా, సుబ్బారాయుడు,దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చూడాలి : కమిషనర్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలో నీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని ఆర్ఆర్ హోమ్స్, సంగయ్యపేట, పాత మండ్లెం రస్తా, కోటవీధి, సూర్యనారాయణ టెంపుల్, అల్లూరు రోడ్డు, ఎబిఎం కాలనీలలో మున్సిపల్ కమిషనర్ పర్యటించి కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి పరిమాణం ఎక్కువగా ఉన్న బోర్లను గుర్తించి, మోటార్లు ఫిట్టింగ్ చేయించి మెయిన్ పైప్ లైన్‌కు కలిపి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సంబంధిత డిఇని ఆదేశించారు. అలాగే పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సెంటర్ ఇన్స్పెక్టర్ అబ్దుల్ రౌఫ్‌ను ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, ఫిట్టర్ రామయ్య, వాటర్ లైన్మెన్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్ రెడ్డి

కొత్తపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ఎన్.కొత్తపల్లి గ్రామంలో కక్షా రాజకీ యాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణం నెలకొనేలా, గ్రామాభివృద్ధి జరిగేలా తాను బాధ్యత వహిస్తానని వైసిపి నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం నంద్యాల మండలంలోని ఎన్. కొత్త పల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.కొత్తపల్లి గ్రామం నుండి ప్రతిసారి సాంప్రదాయంగా ఎన్నికల ప్రచారాన్ని చేపడుతూ అఖండ విజయాన్ని సాధిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో జగనన్నను, నంద్యాలలో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి, నంద్యాల మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు, కొత్తపల్లె నాయకులు కృతుంగ నరేంద్ర, బాలవెంకట రెడ్డి, ఎంపీటీసీ హరినాద్ రెడ్డి, వైస్ సర్పంచి శ్రీనివాసరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి, బొజ్జ శేఖర్ రెడ్డి, తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి, తాతిరెడ్డి సూర్యచంద్రారెడ్డి, బ్రహ్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారు

ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, ఎంపి పోచా బ్రహ్మనంద రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పెన్షన్‌ను ఇంటి వద్దకు అందించే వాలంటీర్ వ్యవస్థపై కక్ష గట్టిన చంద్రబాబు నాయుడుకు, టీడీపీ నాయకులకు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డు పరిధిలో వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో ఈ వార్డులో ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అందించిన సంక్షేమం అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం శిల్పా రవి మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఎన్నికలకు దేవుని మూలగా భావించే 6వ వార్డు నుండి ఎన్నికల ప్రచారం చేయడం, విజయం సాధించడం జరుగుతుందని ఈ సారి కూడా ఎన్నికల ప్రచారం ఇక్కడి నుండే ప్రారంభించామని మరోసారి ఎమ్మెల్యే విజయం తథ్యమనే ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 6వ వార్డులో ప్రతి గడప తిరిగామని ప్రతి ఒక్కరిని కలిసి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం జరిగిందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కేటాయించిన నిధులను వార్డు అభివృద్ధికి వినియోగించామన్నారు. దాదాపుగా ఈ వార్డులో చిన్న చెరువు కట్ట ప్రాంతంలో కోటి 20 లక్షలతో అత్యాధునిక పార్క్ ను, అలాగే జిమ్ ను, వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలను కల్పించామని తెలిపారు. గత 55నెలలుగా ఒకటవ తేదీన నే పెన్షన్ అందుకొంటున్న అవ్వ,తాతలు, దివ్యాంగులైన అక్కా చెల్లెలు, అన్నదమ్ములు, వితంతువులైన అక్కా చెల్లెలు నేడు చంద్రబాబు చేసిన కక్షపూరితమైన వ్యవహారంతో సకాలంలో పెన్షన్ అందుకోలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. పెన్షన్లు ఇంటి వద్దకు అందించే వాలంటరీ వ్యవస్థపై కక్ష కట్టిన చంద్రబాబు నాయుడు అతని అనుచరులతో పార్టీ నాయకులతో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయించారని శిల్పా రవి ఆరోపించారు. వాలంటరీ వ్యవస్థపై కుల్లు, కక్షతో వ్యవహరిస్తున్న చంద్రబాబు నాయుడు, టిడిపి నాయకులకు రానున్న కాలంలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.కార్యక్రమంలో ఆరో వార్డు కౌన్సిలర్ పురందర్ కుమార్ మాజీ కౌన్సిలర్ భీమనపల్లి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆరో వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ

డోన్ : అభివృద్ధి సంక్షేమం కావాలంటే డోన్ ఎమ్మెల్యేగా మూడవసారి కూడా డోన్ ప్రజలు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని గెలిపించుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని ఇందిరానగర్ కు సంబంధించిన 30 వార్డులో డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ అమర్నాథ్ రెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పట్టణంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్లు ఆర్ట్ రమణ,నాగేంద్రమూర్తి, మహేశ్వర రెడ్డి,వెంకట్రాముడు,సుంకన్న, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు,నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్,దారా ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్న బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి

డోన్ అభివృద్ధి అంతా అబద్ధమే : కోట్ల



మాట్లాడుతున్న కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని చెబుతున్న మంత్రి బుగ్గన్న మాటలన్నీ గ్రామాల్లో తిష్ట వేసిన సమస్యలు చూస్తే అన్ని అబద్ధాలే అన్న విషయం ఇట్టే తేలుతుందని డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వీరాయి పల్లె, ముద్ద వరం, ముసలాయ్ చెరువు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వీరాయిపల్లి, ముద్దవరం గ్రామాలలో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తాండవిస్తుంటే ఆర్థిక మంత్రి మాత్రం రూ.350 కోట్లతో గోరుకల్ రిజర్వాయర్ నుండి తాగునీరు అందిస్తున్నామని మాటలు చెప్పడం తప్ప ఏ గ్రామానికి తాగునీరు అందించిన పాపాన పోలేదని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మండల కన్వీనర్ ఉన్నము ఎల్ల నాగయ్య, పోలూరు వెంకటేశ్వర రెడ్డి రాఘవరెడ్డి, భీమేష్ రెడ్డి, తిమ్మారెడ్డి, జనసేన మండల నాయకులు మద్దిలేటి స్వామి, నాయిని రామకష్ణ, కెవి సుబ్బారెడ్డి, సుధాకర్ చౌదరి, చంద్రశేఖర్ చౌదరి, షేక్షావలి చౌదరి, మోహన్ గౌడ్, రామకృష్ణ, శ్రీనివాసులు, టిడిపి జనసేన,కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహానంది: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్యమని టీడీపీ శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి అన్నారు. సోమవారం గాజులపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని బసాపురం, ఆంజనేయపురంలో టిడిపి నాయకురాలు గంగవరపు శశికళ కొండారెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి, తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టాక, అమలు చేయబోయే మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. లక్ష్మీనారాయణ, పాములేటి, మాజీ ఉపసర్పంచ్ కోటేశ్వరావు, బషీర్ అహ్మద్, వెంకటేష్, రామేశ్వరుడు, సలీం, కరీం, ఇర్ఫాన్, మధు, తదితరులు పాల్గొన్నారు.



గాజులపల్లి గ్రామంలో ప్రచారంలో పాల్గొన్న టిడిపి నేతలు

అవుకు : మండలంలోని రామాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని రెండో రోజు సోమవారం నిర్వహించారు. బనగానపల్లె మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి రామాపురం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రామాపురం గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని తాగునీటి సమస్యను కూడా తీర్చలేని అసమర్ధ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, భారతీయ జనతా పార్టీ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిధుల కొరత వల్లే పింఛన్ల పంపిణీ ఆలస్యం

- సిఎస్, సెర్ప్ సిఇఒ, సిఎంపై చర్యలు తీసుకోవాలి
- ఎన్ఎండి ఫరూక్, మల్లెల రాజశేఖర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయక పోవడానికి నిధుల కొరతే కారణమని,ఎలక్షన్ కమిషన్ కాని తెలుగుదేశం కానీ కాదని మాజీ మంత్రి నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్‌లు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తారీకు నుంచే ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయాలని జగన్ రెడ్డి ఎందుకు ఆదేశాలు జారీ చేయలేదని, ఖజానాలో నిధులు లేకనే కదా? అని అన్నారు. స్వార్ధ రాజకీయం వల్లే పింఛన్ దారులు, వాలంటీర్లు నష్టపోతున్నారని తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4000 పింఛను అందిస్తామన్నారు. 1 లక్షా 35 వేల మంది సచివాలయ సిబ్బంది , గ్రామ కార్యదర్శులు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పింఛన్లను ఒకటో తారీకు వారి ఇంటికి చేర్చేందుకు జగన్ రెడ్డి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకటవ తేదీ సాయంత్రం లోపల పింఛన్లు ఇంటి వద్ద ఇవ్వకుంటే దీనికి బాధ్యతగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి,సెర్ప్ సీఈవో మురళీధర్ రెడ్డి, సీఎం జగన్మోహన్ రెడ్డిపై ఎలక్షన్ కమిషన్ తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరూక్, మల్లెల రాజశేఖర్

ముగిసిన ఆర్పిఎల్ క్రీడలు

ప్రజాశక్తి -పాణ్యం : మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో గత నెల 30వ తేదీన ప్రారంభమైన ఆర్జీఎం ప్రీమియర్ లీగ్ క్రీడలు సోమవారం ముగిశాయి. ఈ క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్షిప్ ను ఈసీఈ విభాగం కైవసం చేసుకున్నట్లు పిడి వెంకటేష్ తెలిపారు. పురుషుల కబడ్డీ, హ్యాండ్ బాల్, ఫుట్బాల్, క్రికెట్ పోటీలలో ఈసీఈ విభాగం విన్నర్ గా నిలిచిందన్నారు. వాలీబాల్ విన్నర్‌గా సిఎస్ ఈ విభాగం నిలిచిందన్నారు. మహిళా క్రికెట్, త్రో బాల్, బాస్కెట్బాల్, పోటీలలో సిఎస్ఈ విభాగం విన్నర్‌గా నిలిచింది అన్నారు. టెన్నికా యిట్లో డేటా సైన్స్ విన్నర్గా నిలిచిందన్నారు. బెస్ట్ ఫెర్ఫర్మర్‌గా ఈసీఈ విద్యార్థి సూర్యనారాయణ రెడ్డి నిలిచాడన్నారు. విజేతలకు కళాశాల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతి రాముడు కప్పును, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, సుధీర్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కాటసానికి రాజకీయ భిక్ష పెట్టింది టిడిపినే

- తాను గెలిస్తే 2 సెంట్ల స్థలం ఇస్తా : మాజీ ఎమ్మెల్యే బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీ అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోబీసీ జనార్దన్ రెడ్డి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకాటసాని రామిరెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. 2014లో నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడితే రాష్ట్రాన్ని అన్ని విధాల చంద్రబాబు అభివృద్ధి చేస్తే 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. టిడిపి పాలనలో అభివృద్ధి సంక్షేమం చేస్తే వైసిపి పాలనలో విధ్వంసం కక్ష సాదింపులు ఉన్నాయన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైతే ప్రభుత్వం ఇచ్చిన ఇవ్వకపోయినా పట్టణంలోని పేద ప్రజలందరికీ రెండు సెంట్ల స్థలం సొంతంగా ఇస్తానని తెలిపారు. ఓడిపోతామని బాధతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని బీసీ విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు బీసీ రామనాథ్ రెడ్డి, నాయకులు కాట్రెడ్డి మల్లిఖార్జున రెడ్డి, వంగల పరమేశ్వర రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్ , రాయలసీమ సలాం, కలాం, బొబ్బల గోపాల్ రెడ్డి, ఇస్మాయిల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి 1బిపిఎల్ 1

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమ సాధ్యం

- టిడిపి యువ నేత భార్గవరామ్
- వైసీపీ నుండి టిడిపిలోకి 30 కుటుంబాలు చేరిక



ప్రజాశక్తి, ఆళ్లగడ్డ: టిడిపి తోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని తాలుకా యువ నాయకులు భార్గవరామ్ అన్నారు. సోమవారం రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన ప్రహ్లాద్, నాయుడు, ఓబులేసు, పెద్ద ఓబన్నతో పాటు 30 కుటుంబాలు భార్గవ్ రామ్ ఆధ్వర్యంలో వైస్సార్సీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి భార్గవరామ్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను నమ్మి పార్టీలో చేరిన వారికి అండగా ఉండమన్నారు.. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి భూమా అఖిల ప్రియ విజయానికి కృషి చేయాలన్నారు.

గూటం శివ ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలోకి చేరిక

బేతంచెర్ల : బేతంచెర్ల పట్టణం దుర్గ పేట కు చెందిన వైసిపి కార్యకర్తలు కోట్ల చిత్రమ్మ గారి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక నాయకుడు టీడీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గూటం శివ ఆధ్వర్యంలో వైసిపి కి చెందిన 40 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి, టిడిపి సీనియర్ నాయకులు కోట్ల గిరిధర్ రెడ్డి, పార్టీలోకి చేరిన వైసిపి కార్యకర్తలైన బోగోలు శేఖర్, గజ్జి శ్రీదేవి, గజ్జి శివ వర ప్రసాద్, గజ్జి నిఖిల్, గజ్జి గోపి,కె. నాగార్జున, కె. నాగేంద్ర, వీరాంజనేయులు, శంకర్, గజ్జి మధు, రోహిత్ కుమార్, గజ్జి మధు కుమార్, సుమతి, గణ మద్దిలేటి, పురుషోత్తం, బీరెలి మహేంద్ర, మహేంద్ర, కొణిదెటి నాగరాజ్, గజ్జి మల్లేశ్వరి, గోరుమానుకొండ నిర్మలమ్మ, గజ్జి మధు కుమార్, తదితరులు చేరారు



సిసి రోడ్లను పరిశీలించిన చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల నగర పంచాయతీలోని సంజీవ్ నగర్ కాలనీ లో కాలనీ ప్రజల సౌకర్యార్థం రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన సిసి రోడ్లను, విద్యుత్ స్తంభాలను నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలించడానికి వచ్చిన నాయకులతో కాలనీవాసులు తాగునీటి సమస్యపై, డ్రైనేజీ సమస్యలను విన్నవించగా.. స్పందించిన చైర్మన్ చలం రెడ్డి మాట్లాడుతూ గోరకల్లు రిజర్వాయర్ నుండి ప్రతి గ్రామానికి అలాగే మండల కేంద్రంలోని ప్రతి కాలనీకి తాగునీటి సరఫరా అందించడం జరుగుతుందని తెలిపారు. సంజీవ్ నగర్ సుబ్బారెడ్డి కాలనీ హనుమాన్ నగర్ డ్రైవర్స్ కాలనీ లకు సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు నీటి ట్యాంకర్లతో తరలించి ప్రజల అవసరాలను తీర్చడం జరుగుతుందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే త్వరగా పరిష్కరించబడతాయని వారు తెలిపారు.



తాగునీటి సమస్యపై ప్రజలతో మాట్లాడుతున్న చైర్మన్ చలం రెడ్డి